క్లుప్తంగా

60 మందికి వైద్య పరీక్షలు



పరీక్షలు చేస్తున్న వైద్యుడు

మురళీనగర్ : మురళీనగర్ సమీపంలోని ప్రగతి నగర్ అంగన్‌వాడీ కేంద్రం వద్ద మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో అపోలో ఆస్పత్రి సౌజన్యంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 60 మందికి వైద్య పరీక్షలు చేశారు. బీపీ, సుగర్, దంత వ్యాధులు, హెపటైటిస్, కంటి సమస్యలు, నరాల సెన్సిటివిటీకి సంబంధించిన పరీక్షలు నిర్వహించారు. క్లబ్ అధ్యక్షురాలు సత్తి లలితారెడ్డి పర్యవేక్షణలో నిర్వహించిన శిబిరంలో 101 గవర్నర్ రంగారావు, ఎలెక్ట్ గవర్నర్ కె.ద్వారకానాథ్, బి.సత్యనారాయణ, మురళి, శిరీష, వరలక్ష్మి, లక్ష్మీకుమారి, పూర్ణిమ పాల్గొని శిబిరం నిర్వహణకు సహకరించారు.

ఎమ్మెల్యేను కలిసిన ఏసీపీ



ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుతో ఈస్టు ఏసీపీ లక్ష్మణమూర్తి

సీతమ్మధార : ఇటీవల ఈస్టు ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన లక్ష్మణమూర్తి ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజుని సీతమ్మధార బాలయ్య శాస్త్రి లే అవుట్‌లోని కార్యాలయంలో ఆదివారం కలిశారు. ఎమ్మెల్యేకి మొక్క అందించి పలు అంశాలపై కొద్ది సేపు చర్చించారు.

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ఎర్నిమాంబ అమ్మవారికి హారతి ఇస్తున్న పూజారమ్మ విజయమ్మ

కంచరపాలెం : జ్ఞానాపురం కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా ఆధ్వర్యంలో ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ఉదయం నుంచి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ. 10, రూ. 50 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఈవో సురేష్‌బాబా భక్తుల సౌకర్యాలకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఎండకు భక్తులు ఇబ్బంది పడకుండా మౌలిక వసతులు కల్పించారు. ఆలయ సిబ్బంది ప్రసాద్, రామకృష్ణ, స్వచ్ఛంద సంస్థ సభ్యులు పనులు పర్యవేక్షించారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేస్తా



బాలయ్య శాస్త్రి లే అవుట్‌లో పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, పోలీసులు

సీతమ్మధార : దొంగతనాలు జరగకుండా చర్యలు తీసుకుంటానని, సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం బాలయ్య శాస్త్రి లే అవుట్‌లోని కార్యాలయంలో క్రైం సీఐలు బంగారు పాప, శ్రీనివాసరావుతో ఆయన చర్చించారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో చైన్ స్నాచింగ్, దొంగతనాలతో పాటు ఇతర నేరాలు జరగకుండా చర్యలు తీసుకునేందుకు చర్యలు తీసుకుంటామని సీఐలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొండవాలు ప్రాంతాలున్న కంచరపాలెం, సీతమ్మధార, నార్త్ ఎక్స్‌టెన్షన్, తాటిచెట్లపాలెం, డీఎల్‌బీ ప్రాంతం, కైలాసపురంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం బాలయ్యశాస్త్రి లే అవుట్‌లోని సీసీ కెమెరాలను పరిశీలించారు.

కాలనీల్లో అంధకారం



మురళీనగర్ సెక్టార్ - 8లో ఏడాదిగా లైట్లు వేయని స్తంభం



నిర్వహణ లోపంతో వైశాఖి స్పోర్ట్స్ పార్కులో పగలూ వెలుగుతున్న లైటు



సూర్యానగర్ రహదారిలో చెట్టు కొమ్మల మధ్య వెలుగుతున్న వీధిలైటు



వర్మా కాంప్లెక్సు అనుబంధ రహదారిలో వెలగని వీధిలైటు



హరితపార్కు పశ్చిమ రహదారిలో వెలగని వీధిలైటు

- నిర్వహణ లోపంతో వెలగని వీధి లైట్లు
- కొన్నిచోట్ల వెలుతురును అడ్డగిస్తున్న చెట్ల కొమ్మలు

మురళీనగర్ : మురళీనగర్ పరిసర ప్రాంతాల్లోని పలు కాలనీల్లో అంధకారం నెలకొంది. కొద్ది కాలంగా వీధి దీపాలు వెలగకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మురళీనగర్‌లోని అన్ని సెక్టార్లలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. సమస్యను స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కరించేందుకు చొరవ చూపడం లేదు. ఫలితంగా నివాస ప్రాంతాలు, రహదారి కూడళ్లు, ప్రధాన రహదారుల్లో చీకట్లు నెలకొన్నాయి. మురళీనగర్ సెక్టార్ - 8లోని హరిత పార్కు పరిసర ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగడం లేదు. ఈ ప్రాంతాలన్నీ కొండవాలులో ఉన్నాయి. కొండలను ఆనుకుని నివాస భవనాలు ఉన్నాయి. రాత్రయితే వీరంతా భయాందోళన చెందుతున్నారు. హరిత పార్కు చుట్టూ ఉన్న నాలుగు విద్యుత్ స్తంభాలపై లైట్లు గత నాలుగు నెలలుగా వెలగడం లేదు. పార్కు పశ్చిమ వైపు రహదారిలోని విద్యుత్ స్తంభంపై లైటు పాడై నాలుగు నెలలు కావస్తున్నా కొత్తవి ఏర్పాటు చేయలేదు. ఉత్తరం వైపు రెండు కరెంటు స్తంభాలున్నా వాటిని నిరుపయోగంగా వదిలేశారు. ఒక స్తంభానికి హోల్డరు ఉన్నా వీధి లైటు అమర్చలేదు. ఆ పార్కు తూర్పు వైపు ప్రధాన రహదారిలో స్తంభంపై రింగ్ లైట్లు ఏర్పాటు చేయక ఏడాదిగా నిరుపయోగంగా ఉంది. బాలభాను పాఠశాల వద్ద విద్యుత్ లైటు ఏర్పాటు చేయాల్సి ఉంది.

మురళీనగర్ – మాధవధార సెక్టార్లలోనూ...

మురళీనగర్ – మాధవధార పరిధిలోని 13 సెక్టార్లలో అనేక చోట్ల వీధి లైట్లు వెలగడం లేదు. సుమారు 50 లైట్లు వెలగడం లేదని స్థానికులు చెబుతున్నారు. అధికారులకు నిత్యం ఫిర్యాదు చేస్తున్నా స్పందించడం లేదని ఆరోపిస్తున్నారు. వర్మా కాంప్లెక్సు నుంచి సెక్టార్ – 8కి వెళ్లే రహదారిలోని ఒక అపార్ట్‌మెంట్ సమీపంలో 328/7 నంబరు స్తంభంపై విద్యుత్ లైటు ఏడాదిగా వెలగడం లేదని స్థానికులు చెబుతున్నారు. పార్కుల్లో ఏర్పాటు చేసిన లైట్లు తెల్లవారగానే స్విచ్ ఆఫ్ చేయాల్సి ఉన్నా ఉదయం 8.30 గంటల వరకు ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో కొన్ని చోట్ల లైట్లు పగటి పూటా వెలుగుతూనే ఉన్నాయి. వైశాఖి స్పోర్ట్స్ పార్కులోని లైట్లు ఆదివారం ఉదయం 8.30 గంటల వరకు ఆర్పడం లేదు.

నిర్వహణ లోపం వల్లే సమస్యలు

వీధిలైట్ల నిర్వహణలో స్థానిక సిబ్బంది నిర్లక్ష్యం, లోపాలు కనిపిస్తున్నాయి. వెలగని లైట్లకు సంబంధించి అధికారులు ఎప్పటికప్పుడు సమాచారం సేకరించి వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయడం లేదా వీలుంటే మరమ్మతులు చేసి పనిచేయించాల్సి ఉంటుంది. కానీ వీటిని పట్టించుకున్న నాథుడే కనిపించడం లేదు. కొన్ని ప్రాంతాల్లో ఒక రోజు వెలిగి మరుసటిరోజు వెలగకపోవడం వంటి సాంకేతిక పరమైన సమస్యలు ఉన్నాయి.

ఇక బిర్లా కూడలి నుంచి ఊర్వశి కూడలి వరకు ఎడమవైపు సర్వీసు రహదారిలో చీకట్లు నెలకొన్నాయి. జాతీయ రహదారికి అనుబంధంగా ఏర్పాటు చేసిన లైట్లలో సర్వీసు రహదారివైపు ఉన్న లైట్లు కొన్ని వెలగడం లేదు. మరి కొన్ని చెట్ల కొమ్మల్లో దాగి ఉండడంతో వెలుతురు రహదారిపైకి రావడం లేదు. సూర్యానగర్ నుంచి పట్టాభిరెడ్డితోట మలుపుల రహదారిలోనూ ఇదే పరిస్థితి. చెట్ల కొమ్మలను తొలగిస్తే ఈ సమస్యకు పరిష్కారం ఉంటుందని తెలిసినా పట్టించుకునే వారే కరువయ్యారు.

సర్కిల్ లైట్లు వెలగడం లేదు



కూడలిలోని సర్కిల్ లైట్లు వెలగడం లేదు. దీంతో ప్రయాణాల సమయంలో ఇబ్బందులు పడుతున్నాం. మా నివాసాలు కొండ పాంతాన్ని ఆనుకుని ఉండడంతో పాములు, తేళ్లు వంటి వాటి నుంచి ప్రమాదం పొంచి ఉంది. వర్షా కాలంలో మా ప్రాంతంలో సంచరించడం ప్రమాదకరంగా మారింది. అధికారులు తక్షణమే చర్యలు తీసుకుని వీధిలైట్లు వెలిగేలా చూడాలి.

– పి.శ్రీహరి, సుశీల ప్లాజా, మురళీనగర్

అంధకారంలో ప్రమాదాలు



హరిత పార్కు చుట్టూ ఉన్న స్తంభాలపై లైట్లు వెలగడం లేదు. పశ్చిమ వైపు ఉన్న స్తంభంపై ఏడాదిగా లైటు వెలగడం లేదు. చీకట్లో ప్రయాణించేటప్పుడు కుక్కల బెడద ఎక్కువయ్యింది. పాదచారులపై కుక్కలు దాడి చేసి గాయపరుస్తున్నాయి. కూడళ్లలో దొంగతనాలు, చైన్ స్నాచింగ్స్ జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి లైట్ల పనితీరును పర్యవేక్షించాలి.

– కొణతాల సూర్యనారాయణ, మురళీనగర్

వీధిలైట్ల కొరత తీర్చాలి



కాలనీల్లో వీధిలైట్ల సమస్య తీవ్రంగా ఉంది. జీవీఎంసీ 49, 50వ వార్డులో విస్తరించిన మురళీనగర్ సెక్టార్లలో ఏదో ఒక చోట నిరంతరం దీనిపై మా సంఘానికి ఫిర్యాదులు అందుతున్నాయి. అధికారుల దృష్టికి తీసుకెళ్తే విద్యుత్ దీపాల కొరత ఉందని చెబుతున్నారు. కొత్తలైట్లు అమర్చేందుకు జీవీఎంసీ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలి. నిర్వహణపై దృష్టి సారించాలి.

– సనపల వరప్రసాద్,
అధ్యక్షుడు, మురళీనగర్ రెసిడెంట్స్ అసోసియేషన్

భవన నిర్మాణ సామగ్రి తొలగింపు



రోడ్డు పక్కనే ఉన్న భవన నిర్మాణ సామగ్రి తొలగిస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

సీతమ్మధార : జీవీఎంసీ 14వ వార్డు బాలయ్యశాస్త్రి లే అవుట్‌లో ఒక బిల్డర్ రోడ్డు పక్కన వదిలేసిన భవన నిర్మాణ సామగ్రిని జీవీఎంసీ సిబ్బంది ఆదివారం తొలగించారు. సామగ్రిని రోడ్డుపైనే వుంచేయడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ సమస్యపై ఈ నెల 21న ''ఆరు నెలలుగా రోడ్డుపైనే భవన నిర్మాణ సామగ్రి'' శీర్షికతో సాక్షిలో వార్త ప్రచురితమైంది. దీంతో జీవీఎంసీ అధికారుల ఆదేశాలతో సిబ్బంది స్పందించి సామగ్రి తొలిగించారు. సామగ్రి రోడ్డుపై ఉండిపోవడం వల్ల ఇన్నాళ్లు ట్రాఫిక్ సమస్యలు ఎదుర్కొన్న స్థానికులు సాక్షిని అభినందించారు.

ఆర్టీసీ డీపీటీవోపై చర్యలు తీసుకోవాలని వినతి

సీతమ్మధార : ఆర్టీసీ డీపీటీవోపై చర్యలు తీసుకోవాలని నేషనల్ మజ్దూర్ యూనిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజుకి ఆదివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి బి.నీలకంఠం మాట్లాడుతూ గత 43 రోజులుగా వాల్తేరు డిపోలో నిరసనలు తెలియజేస్తున్నప్పటికీ యాజమాన్యం స్పందించకపోవడంతో సమస్యను ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్లాలని డివిజన్ కమిటీ తీర్మానం చేసిందన్నారు. డీపీటీవో బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి జిల్లాలోని అన్ని రూట్లలో అనేక షెడ్యూల్స్ రద్దు చేశారని, ప్రస్తుత ప్రభుత్వం గతంలో ఇచ్చిన 1/2019 సర్క్యులర్‌ని పాటించడం లేదని, వాల్తేరులో ఎర్నింగ్ సెక్షన్ మార్చడం వల్ల డిపో మేనేజర్ ఆఫీస్ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని ఆరోపించారు. డివిజన్ కార్యదర్శి ఎ.కె.శివాజీ, డివిజన్ అధ్యక్షులు వి.ఎస్.ఆర్.మూర్తి, వాల్తేరు డిపో అధ్యక్ష, కార్యదర్శులు రాయిపాటి వసంతరావు, పి.జి.పతి, గాజువాక డిపో కార్యదర్శి పిళ్లా శంకరావు పాల్గొన్నారు.

రౌడీయిజం చేస్తే పీడీ యాక్ట్

- అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవు
- రౌడీషీటర్లకు పోలీసుల కౌన్సెలింగ్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఫోర్తుటౌన్ సీఐ ఎస్.విజయకుమార్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న క్రైం సీఐ శ్రీనివాస్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ద్వారకా సీఐ డి.వి.రమణ

సీతమ్మధార : ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలో అల్లర్లు సృష్టించినా, రౌడీయిజం చేసినా పీడీ యాక్ట్ అమలు చేస్తామని ద్వారకా సీఐ డి.వెంకటరమణ హెచ్చరించారు. ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలో పలు కేసుల్లో ఉన్న రౌడీషీటర్లకు ఆదివారం ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. వారి వేలిముద్రలతో పాటు సంతకాలు సేకరించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రౌడీషీటర్లు సత్ప్రవర్తన కలిగి ఉండాలని సూచించారు. ప్రసుత్తం తీరు మార్చుకోని వారిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో కొందరు రౌడీషీటర్లను నగర బహిష్కరణ చేశారని, ప్రస్తుతం ఎవరైనా హద్దు మీరితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎప్పటికప్పుడు పోలీస్ నిఘా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ ధర్మేంద్ర, ఏఎస్ఐ డి.వి.రత్నం, సిబ్బంది పాల్గొన్నారు.

● సమాజంలో అల్లర్లు సృష్టించకుండా, తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబంతో హాయిగా జీవించాలని ఫోర్తుటౌన్ సీఐ ఎస్.విజయకుమార్ సూచించారు. స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం ఆయన కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారి రోజువారీ కార్యకలాపాలపై ఆరా తీశారు. అల్లర్లు సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై నరసింహరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగాలి

మద్రిపాలెం : అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని కంచరపాలెం క్రైం సీఐ ఎస్.శ్రీనివాస్ రౌడీ షీటర్లను హెచ్చరించారు. ఈ మేరకు పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొడవలు, కొట్టుకోవడాల్లో తలదూర్చితే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా జీవించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. సమాజంలో అల్లర్లు సృష్టించినా, గొడవల్లో తలదూర్చినా ఉపేక్షించేది లేదన్నారు. ఎప్పటికప్పుడు వారి కదలికలపై నిరంతరం పోలీస్ నిఘా ఉంటుందన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన



నేత్ర వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మురళీనగర్ : మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కులో వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మ్యాక్సీ విజన్ కంటి ఆస్పత్రి సౌజన్యంతో ఆదివారం ఉదయం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. క్లబ్ అధ్యక్షురాలు పొందూరు ప్రభావతి అధ్యక్షతన నిర్వహించిన శిబిరాన్ని వాకర్స్ డిస్ట్రిక్ట్ – 101 గవర్నర్ టి.రంగారావు ప్రారంభించారు. ఈ శిబిరంలో డాక్టర్ ఎంకే కృష్ణనాయక్ పర్యవేక్షణలో వంద మందికి బీపీ, సుగర్ పరీక్షలతోపాటు కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైశాఖి స్పోర్ట్స్ పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్, వాకర్స్ డిస్ట్రిక్ట్ – 101 పూర్వ గవర్నర్ ఉప్పలపాటి శుభ, క్లబ్ కార్యదర్శి ఎం.జయ, సంయుక్త కార్యదర్శి కె.భానుమతి, జాలీ వాకర్ ఎం.ప్రమీలారావు, ఎడిటర్ ఆర్.స్నేహలత, కార్యవర్గ సభ్యులు కె.బిందురాణి, జి.మంగాదేవి, ఎ.లీలావతి, పొందూరు సూర్యనారాయణ, ఎల్‌వీ సుధాకర్ పాల్గొని శిబిరం నిర్వహణకు సహకరించారు.

జాతీయ మహాసభలు జయప్రదం చేయండి

మద్రిపాలెం : ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ 18వ జాతీయ మహా సభలను జయప్రదం చేయాలని కోరుతూ ఆటోడ్రైవర్లు ప్రచార సమావేశం ఆదివారం నిర్వహించారు. రైల్వే స్టేషన్ ఇన్ గేట్ జంక్షన్ వద్ద నిర్వహించిన సమావేశంలో ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆటో అండ్ మోటార్ వాహన ఓనర్ కమ్ డ్రైవర్లపై ఆర్థిక భారం మోపే జీవో 21 31ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాదాల నివారణ పేరుతో కేంద్ర ప్రభుత్వం చేసిన 2023 నూతన మోటార్ యాక్ట్ చట్టాన్ని రద్దు చేయాలన్నారు. ఈ నెల 24, 25న బెంగళూరులో నిర్వహించే జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రావి కృష్ణ, వై.వెంకట్, ఎస్.చెనారెడ్డి, హెచ్ఏ ఖాన్, శేఖర్, గణేష్‌కుమార్ పాల్గొన్నారు.

బలమైన చట్టాలున్నా ప్రయోజనం శూన్యం



అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న భీమ్‌సేన వార్ ప్రతినిధులు

సీతంపేట : భీమ్ సేన వార్ ఆధ్వర్యంలో ద్వారకా నగర్ పౌరగ్రంథాలయంలో షెడ్యూల్డ్ జాతులు, తెగల అత్యాచార నిరోధక చట్టం 1989 పూర్వం, వర్తమానం, భవిష్యత్ అనే అంశంపై ఆదివారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ న్యాయవాది ఎస్.హెచ్ఈ అక్బర్ మాట్లాడుతూ కుల వివక్ష, షెడ్యూల్ తెగలపై అఘాయిత్యాలను, ద్వేషపూరిత నేరాలను నిరోధించడానికి ఉద్దేశించిన బలమైన చట్టం ఉన్నప్పటికీ శిక్షా రేటు చాలా తక్కువగా ఉందన్నారు. కేసుల దర్యాప్తులో చాలా జాప్యం జరుగుతోందని తెలిపారు. బలమైన చట్టాలు ఉన్నప్పటికీ వాటిని నిర్వీర్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టాలను పూర్తి స్థాయిలో అమలు చేసినప్పుడే దాని ఫలితాలు పొందగలమన్నారు. అలాగే పాయకరావుపేట మండలంలో జరిగిన వడ్లమూడి నాగేంద్ర హత్య కేసు అధ్యయన నివేదికపై బడుగు దుర్గాబాబు మాట్లాడారు. ఇటీవల పదవీ విరమణ చేసిన చింతకాయల రాంజీని సత్కరించారు. అనంతరం అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ఎస్.ఆర్.వేమన, అధ్యక్షుడు కె.చిన్నారావు, కోశాధికారి వసంత రాజేంద్రప్రసాద్, కార్యదర్శి బి.కనకరాజు పాల్గొన్నారు.

ఏఎం ఫ్రెడ్డీ సేవలు అభినందనీయం



ఏఎం ఫ్రెడ్డీతో రిటైర్డ్ ఉద్యోగులు, అసోసియేషన్ సభ్యులు

కంచరపాలెం : బర్మా కాందిశీకులకు ఏఎం ఫ్రెడ్డీ అందించిన సేవలు ఎంతో అభినందనీయమని ఆంధ్ర బౌద్ధ సమాజ ప్రధాన కార్యదర్శి కె.రాజుగణేష్ పేర్కొన్నారు. ఈ మేరకు కంచరపాలెం బౌద్ధ సమాజ కేంద్రంలో ఆదివారం విశాఖ పోర్టు ట్రస్ట్, బర్మా రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సత్కార వేడుకల్లో ఆయన మాట్లాడారు. నాడు బర్మా ఆణిముత్యమని, నేడు వైజాగ్ వజ్రమని పలువురు ఫ్రెడ్డీ సేవలను కొనియాడారు. ముందుగా ఏఎం ఫ్రెడ్డీని బర్మా కాందిశీకులు, రిటైర్డ్ ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కుసుమరావు, కిషోర్, డీఆర్ మోహన్, హరిపీటర్స్, జి.రాజు, చెట్లా బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యంతోనే శాంతిస్థాపన



శాంతి సదస్సులో పాల్గొన్న మయన్మార్ విద్యార్థులు, తదితరులు

సీతంపేట : అంతర్జాతీయ శాంతి దినోత్సవం సందర్భంగా ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మోనీ, ఫ్రీడం ఫర్ రెలీజియస్ సంస్థల ఆధ్వర్యంలో బుల్లయ్య కళాశాలలో గల గాంధీ సెంటర్‌లో 'శాంతి అభివృద్ధిపై' సదస్సు ఆదివారం నిర్వహించారు. ముందుగా సంస్థ చైర్మన్ నరవ ప్రకాశరావు సర్వమత ప్రార్థన చేశారు. ముఖ్య అతిథి ఆచార్య వి.బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ మత సామరస్యంతోనే శాంతిస్థాపన సాధ్యమన్నారు. అభివృద్ధి సాధించాలంటే అన్ని దేశాలు శాంతిని పాటించాలన్నారు. సర్వ మతాలు ఐక్యంగా ఉంటే శాంతి స్థాపన సాధ్యమవుతుందన్నారు. నేడు అన్ని దేశాలు న్యూక్లియర్ బాంబులు కలిగి ఉన్నాయని, రక్షణకు అధిక మొత్తంలో ఖర్చు చేస్తూ, సంక్షేమానికి తక్కువ నిధులు కేటాయించాల్సిన పరిస్థితి ఉందన్నారు. సకల జంతు జాలాన్ని నాశనం చేసే ప్రమాదకరమైన ఆయుధాలు లేని ప్రపంచాన్ని చూడాలని, ఆ విధంగా భావితరాలు శాంతియుతమైన సమాజాన్ని వారసత్వంగా పొందగలరని ఆశిద్దామని తెలిపారు. సమావేశంలో బ్రహ్మకుమారి బి.కె.కామేశ్వరి, ఏయూ తెలుగు ఆచార్యులు వెంకటేశ్వర యోగి, మయన్మార్ విద్యార్థులు రాజా దామా, కోన వెంకటరావు, ఉషారాణి, హరగోపాల్ పాల్గొని శాంతి ప్రతిజ్ఞ చేశారు.

వరద బాధితుల కోసం విరాళాల సేకరణ



విరాళాలు సేకరిస్తున్న ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్ తదితరులు

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పరిధి సెయింట్ పీటర్ ప్రధాన దేవాలయ పీపీసీ సంఘాల ప్రతినిధుల ఆధ్వర్యంలో ఆదివారం వరద బాధితలకు విరాళాలు సేకరించారు. ఈ మేరకు సెయింట్ పీటర్స్ విచారణకర్తలు రెవండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్ విరాళాల సేకరణ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి వస్తు, ధన రూపంలో విరాళాలు సేకరించి ఖమ్మం, కృష్ణ, గుంటూరు ప్రాంతాల వరద బాధితులకు అందించనున్నామని తెలిపారు. అనంతరం కొండవీధి, స్లీప్‌గుర్తువీధి, డయాస్‌వీధి, గెడ్డవీధి, పార్క్‌వీధి, పోస్టాఫీస్ వీధి, మాన్యువల్ స్ట్రీట్ ప్రాంతాల్లో విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో ఫాదర్లు అంథోనీ రాజ్, వినయ్, పీపీసీ సభ్యులు, క్రైస్తవులు తదితరులు పాల్గొన్నారు.

దళిత పోలీసులకు పోస్టింగ్‌లలో వివక్ష తగదు



మాట్లాడుతున్న రవి సిద్ధార్థ

సీతంపేట : దళితులు ఏ స్థానంలో ఉన్నా కులం కారణంగా వివక్ష ఎదుర్కొంటున్నారని భీమ్ సేన వ్యవస్థాపకుడు రవి సిద్ధార్థ ఆరోపించారు. రామా టాకీస్ రోడ్‌లోని అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో పోలీస్ ఉన్నతాధికారులు దళితులైతే వారికి ప్రాధాన్యత లేని పోస్టులు ఇస్తున్నారని ఆరోపించారు. పోలీస్ విభాగంలో విశాఖ రేంజ్‌లో 60 నుంచి 70 స్థానాల్లో ఒకరిద్దరు తప్ప దళిత, ఆదివాసీ ఇన్‌స్పెక్టర్లకు అవకాశాలు ఇవ్వలేదన్నారు. విశాఖ సిటీ పరిధిలో 16 మంది ఎస్సీ, ఎస్టీ ఇన్‌స్పెక్టర్లకు పోస్టింగ్స్ లేకుండా రిజర్వ్‌లో ఉంచారని తెలిపారు. ఇది కుల వివక్షే అని, రాజ్యాంగబద్ధంగా తమకు సంక్రమించిన హక్కులను కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వందకు 15 మంది ఎస్సీలకు, వందకు ఏడుగురు ఆదివాసీలకు పదోన్నతులు, పోస్టింగ్స్‌లో ప్రాధాన్యత కల్పించాలన్నారు. విశాఖ రేంజ్‌లో మాత్రం ముగ్గురికే పోస్టింగ్స్ ఇచ్చారని, ఇది వివక్షే అని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోకపోతే రాష్ట్ర వ్యాప్త పోరాట దిశగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.